క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



ఊలపల్లిలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

బిక్కవోలు: ఊలపల్లిలో దోమల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం గ్రామంలోని డ్రైనేజీలు, వీధుల్లో మురుగు గుంతల వద్ద దోమల నివారణ మందు పిచికారీ చేశారు. అలాగే పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ పనులను ఎంపీటీసీ సభ్యుడు బండారు శివ పర్యవేక్షించారు.

లోక్ అదాలత్‌లో 733 కేసుల పరిష్కారం

అనపర్తి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 733 కేసులు పరిష్కారమైనట్లు లోక్ అదాలత్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తెలిపారు. న్యాయమూర్తి పి.చైతన్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 7 సివిల్, 691 క్రిమినల్, 28 ఎన్‌ఐ యాక్ట్ కేసులు, 6 ఈపీ కేసులు, డీవీసీ కేసు ఒకటి పరిష్కారమైనట్లు వివరించారు. లోక్ అదాలత్ సభ్యుడు కోనాల శ్రీధర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, న్యాయవాదులు టీవీవీ రమణమూర్తి, పీవీ రామకృష్ణ, పి.వీరబాబు, ఎ.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండలోని స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమం శనివారం కూడా కొనసాగింది. శనివారం స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త ఎస్.పి రంగరాజబట్టర్, సిబ్బంది ఆర్.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వాటర్ ట్యాంకు ఏర్పాటు

సీటీఆర్ఐ: మహా శివరాత్రికి స్థానిక కోటిలింగాలపేటలోని చింతాలమ్మ ఘాట్ శివుని విగ్రహం వద్ద ఆదిరెడ్డి కుటుంబ సభ్యులు తమ భవానీ చారిటబుల్ ట్రస్టు తరఫున మంచి నీళ్ల వాటర్ ట్యాంకు ఏర్పాటు చేశారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యం, మహా శివరాత్రి సందర్భంగా గోదావరి పుణ్య స్నానాలు ఆచరించేందుకు గోదావరికి వచ్చే భక్తులు అలాగే చింతాలమ్మ ఘాట్ వద్ద గోదావరి గట్టున వ్యాయామాలు చేసుకునేందుకు వచ్చే వారి దప్పిక తీర్చుకునేందుకు ఈ మంచినీళ్ల వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసినట్టు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి వారికి మాఘమాసం మూడో శనివారం విశేష పూజలు చేశారు. స్వామికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో భక్తులతో గోవింద నామాలు ఆచరింప చేసి, పారాయణం చదివించారు.

17న చంద్రబాబు అనపర్తి పర్యటన

అనపర్తి: నియోజకవర్గ పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 17న అనపర్తిలో పర్యటించనున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు ఫిబ్రవరి 15, 16 తేదీల్లో జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల పర్యటనను పూర్తి చేసుకుని 17వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు సామర్లకోటలో బయలుదేరి అనపర్తి చేరుకుంటారని చెప్పారు. అనపర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చంద్రబాబు ప్రసంగిస్తారని, బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొంకుదురు పీహెచ్‌సీకి మంచి రోజులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు పీహెచ్‌సీకి మంచి రోజులు వచ్చాయని సర్పంచ్ సత్తి వీరమణి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలో సిబ్బంది లేక ఇంత కాలం ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. ఇక్కడ మొత్తం ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇటీవల కొంకుదురు వచ్చిన స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నట్లుగా తమకు సమాచారం వచ్చిందని, త్వరలోనే పోస్టులు భర్తీ చేయనున్నారని సర్పంచ్ తెలిపారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

సెల్ చెబుతుంది.. ఆరోగ్య సమాచారం

- గర్భిణులు, బాలింతలకు సేవలు
- కిల్కారీ విధానంతో మేలు



బిక్కవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గర్భిణులు

బిక్కవోలు: హలో.. నేను డాక్టర్‌ను మీకు సమస్కారం.. భారత ప్రభుత్వం నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీరు ఎలా ఉన్నారు.. ఏం చేస్తున్నారు.. ఆరోగ్యం ఎలా ఉంది.. పాపాయి బాగుందా! అంటూ ఆప్యాయతతో కూడిన పలకరింపుతో గర్భిణులు, బాలింతలకు ఫోన్ కాల్స్ వస్తుంటాయి. మనం చెప్పే సమాధానం ఆధారంగా ఆరోగ్య సమాచారాన్ని చేరవేస్తుంటారు. కేంద్రం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కిల్కారీ (వాయిస్‌తో కూడిన సమాచారం) పేరిట ఓ సరికొత్త కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు ఈ విధానాన్ని వినియోగిస్తున్నారు. దీని కోసం సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనపర్తి నియోజకవర్గంలో రెండు సీహెచ్‌సీలు, ఏడు పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఏటా రెండు వేల మంది గర్భిణులకు సేవలందిస్తుంటారు. వీరందరికీ సమయానుకూలంగా వైద్య సేవలు అందేలా క్షేత్ర స్థాయిలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పని చేస్తున్నారు. అదే సమయంలో వీరు అదనంగా వివిధ రకాల సర్వేలు, కోవిడ్ సమాచారం ఇతత్రా వివరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోని ఒక్కోసారి గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై అంతగా దృష్టి సారించడానికి వీలుండదు. ఇలాంటి సమయంలో కిల్కారీ విధానం దోహదపడనుంది. గర్భిణిగా నమోదైన రెండో త్రైమాసికం నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకూ ఏ ఏ వారం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే ఆరోగ్య సమాచారాన్ని 72 వారాల పాటు వారానికి ఒక ఆడియో వాయిస్ రూపంలో కిల్కారీ విధానం ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనివల్ల అవగాహన పెరిగి మాతాశిశు మరణాలు తగ్గడంతో పాటు సురక్షిత ప్రసవాలు జరగడానికి అవకాశం ఉంటుందని వైద్యఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.

నేరుగా కలవకపోయినా..

కోవిడ్ వంటి కష్టకాలంలో బాలింతలు, గర్భిణులకు ఆరోగ్య సేవలు అందడం గగనమైంది. వైరస్‌కు భయపడి ఆరోగ్య సిబ్బంది వారి పరీక్షించే అవకాశమే కాదు.. పలకరించే పరిస్థితి లేకుండా పోయింది. కరోనా సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన లేక ప్రాణాలు విడిచిన వారూ ఉన్నారు. మరికొందరు పౌష్టికాహార లేమి, రక్తహీనతతో చనిపోతున్నారు. కిల్కారీ లాంటి విధానంతో ఇకపై అలాంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఆరోగ్య సిబ్బందిని నేరుగా కలవకపోయినా తమ ఫోన్‌కు వచ్చిన సమాచారాన్ని తెలుసుకుంటే చాలు.

వైద్యం గురించి సూచనలు

గర్భిణిగా నమోదైనప్పుడే వారి ఫోన్ నంబర్ తీసుకుంటారు. వారికి కాల్ వస్తుంది. దానిలో అందించిన వివరాల ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించుకోవాల్సిన వైద్యం గురించి సూచనలిస్తారు. ఆ సమయంలో మాట్లాడడం కుదరపోతే తర్వాత 14423కి కాల్‌చేసి వివరాలను తెలసుకునేలా ఈ విధానాన్ని రూపొందించారు. ఆండ్రాయిడ్ ఫోన్ కాదు కీప్యాడ్ ఫోన్ ఉన్నా సరిపోతుంది.

అవగాహన కల్పించాం..



కిల్కారీ విధానం ద్వారా మారుమూల పల్లెల్లో నివసించే వారి ఆరోగ్య సమస్యలను గుర్తించడం తేలికవుతుంది. ఇందులో గర్భిణులు, బాలింతలనే కాదు ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేయడానికి అవకాశం ఉంది. ఈ మేరకు ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించాం. వారికి క్షేత్ర స్థాయిలో సూచనలు చేశారు. సకాలంలో అందరికీ వైద్యం అందించడానికి ఈ విధానం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, కొంకుదురు

465 మందికి వైద్య పరీక్షలు



బొబ్బిల్లంక అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: బొబ్బిల్లంక గ్రామంలో శనివారం జరిగిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 465 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ మెల్లిమి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు మల్లిన చౌదరి, శ్రీనివాస్ తదితరులు ప్రారంభించగా పీహెచ్‌సీ డాక్టర్ రాజు రోగులకు వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లల ఆరోగ్యాన్ని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సూర్యకుమారి, హెల్త్ అసిస్టెంట్ రూప్‌కుమార్, ఏఎన్‌ఎం దేవి, ఎంఎల్‌హెచ్‌పీ స్వేత, ఆశవర్కర్లు వీర కుమారి, వీర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద అభివృద్ధికి 'చేయూత'

- జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు సత్య గోవింద్
- పశువైద్యశాల, ఆర్‌బీకేల తనిఖీ



కోరుకొండ పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న సత్య గోవింద్

మధురపూడి: పశు సంపద అభివృద్ధికి వైఎస్సార్ చేయూత పథకం తోడ్పడుతోందని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఎస్‌టీజీ సత్య గోవింద్ అన్నారు. శనివారం కోరుకొండ పశ్చిమ గానుగూడెంలోని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుల కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ చేయూత మూడో విడతలో భాగంగా రూ.18,750 నేరుగా డీబీటీ ద్వారా లబ్ధిదారులు పొందుతున్నారన్నారు. ఆయా లబ్ధిదారులతో మాట్లాడి, వారిలో ఆవులు, గేదెలు కొనుగోలు చేయాలనే ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేస్తారన్నారు. వారికి నగదు బదులు పశువులను కొనుగోలు చేసి అందిస్తారన్నారు. జిల్లాలో 8,300 మందిని పాడి రైతులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ పని చేస్తున్నట్టు, దానిలో భాగంగా ఇప్పటికే 5,200 మంది లబ్దిదారులను ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసినట్టు తెలిపారు. అనంతరం కోరుకొండలోని ప్రాంతీయ పశువైద్యశాల, బూరుగుపూడి, కోటికేశవరం పశువైద్యశాలలు, ఆర్‌బీకేలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, పని విధానం గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఆ శాఖ సహాయ సంచాలకులు పి.ప్రభావతి, వైద్యులు రాజశేఖర్, వనిత, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సుందరమ్మ సత్రం భూములకు వేలంపాట నిర్వహించాలి

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో సుందరమ్మ సత్రం భూములకు వేలం పాటలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన రంపయర్రంపాలెంలో విలేకర్లతో మాట్లాడారు. సుందరమ్మ సత్రం భూములకు వేలం పాటలు నిర్వహించి భూస్వాములపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు సమర్పించామన్నారు. అధికారులు ఇటీవల రీ సర్వే నిర్వహించి 79 ఎకరాల సత్రం భూమి ఉందని తెలిపారన్నారు. దీనిపై జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి సత్రం భూములకు వేలంపాటుల నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, సహాయ కార్యదర్శి కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని బలిగొన్న కంటైనర్

రాజానగరం: బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వృద్ధురాలిని(60) కంటైనర్ కబలించింది. దివాన్‌చెరువు పెట్రోలు బంకు దాటిన తరువాత గైట్ కళాశాల వైపు నడిచివెళుతున్న ఆమెను వేగంగా వెళ్తున్న వాహనం బలంగా ఢీ కొని దూసుకు పోవడంతో ప్రాణాలు కోల్పోయింది. గురువారం రాత్రి సమయంలో జరిగిన ఈ సంఘటన పై బొమ్మూరు పోలీసులను వివరణ కోరగా ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కల్యాణం.. వైభోగం



పులుగుర్తలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు



సామూహిక లక్ష్మీ పూజలు చేస్తున్న భక్తులు

అనపర్తి: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకట రమణుని కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. భక్తుల గోవిందనామ స్మరణతో పులుగుర్త గ్రామం మార్మోగింది. అక్కడి శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శతాధిక ప్రతిష్ఠాపనాచార్య పెదపూడి రఘురామ్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు పెద్దింటి శేషాచార్యులు పర్యవేక్షణలో పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణ క్రతువును జరిపించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారు, ఉభయ దేవేరుల ఉత్సవమూర్తులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు ప్రముఖులు, కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. శనివారం ఉదయం నిత్య పూజల అనంతరం భక్తులు 108 చిట్టి గాజులతో సామూహిక లక్ష్మీ పూజలు చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల రథోత్సవం జరిగింది. అదేవిధంగా సాయంత్రం మహా శాంతి హోమం, హోత్ర ప్రశంసనం అనంతరం గ్రామ ప్రదక్షిణ సేవలు నిర్వహించారు.

వ్యాన్ ఢీకొని మహిళ మృతి

రాజానగరం: జి.యర్రంపాలెంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించిన సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మోరంపూడిలో ఉంటున్న స్వయంవరపు రాణి(35), ఆమె భర్త రమణ కేశవరం రోడ్డులో ఉన్న ఇటుక బట్టీలో పనిచేస్తు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారువురూ బట్టీలో రోజు వారీ పని ముగించుకుని తమ మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తుండగా జి.యర్రంపాలెం వచ్చే సరికి ఎదురుగా వస్తున్న నర్సరీ వ్యాన్ (బొలోరా) ఢీకొంది. ఈ సంఘటనలో మోటారుసైకిల్‌పై వెనుక కూర్చున్న రాణి అక్కడికక్కడే మృతి చెందగా, రమణ గాయాలతో బయటపడ్డాడు. ఢీ కొట్టిన వ్యాన్ ఆమె తలను ఛిద్రం చేయడంతో కళ్లెదుటనే చనిపోయిన భార్య మృతితో రమణ విలవిల్లాడిపోయాడు. గాయాలతో ఉన్న అతని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

తంటికొండ వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో జిల్లా నలుమూలల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి పంచహారతులు సమర్పించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 1500 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారని, 250 మంది భక్తులు తలనీలాలు సమర్పించారని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

కంప్యూటర్ కోడింగ్‌లో ముగిసిన శిక్షణ



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన పెంచుకునేందుకు ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులు ఆచార్య తలారి వాసు అన్నారు. దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ 'సి' కోడింగ్‌లో విద్యార్థులకు ఇస్తున్న ఉచిత శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన ముగింపు సమావేశంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ సుంకర వెంకటేశ్వరావు, సభ్యులు సుంకర నాగేశ్వర్రావు, సుంకర వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

బిక్కవోలు: అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఊలపల్లి గ్రామానికి చెందిన పెండపాటి సింధుకి పెదపాడు మండలం వట్లూరు గ్రామానికి చెందిన పెండపాటి రవికుమార్‌తో 2013లో వివాహమయ్యిందన్నారు. అప్పుడు కట్నంగా రూ.1 లక్ష నగదు, 3 కాసుల బంగారం ఇచ్చినా, అదనపు కట్నం కావాలని శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారని సింధు ఫిర్యాదు చేసిందన్నారు. రవికుమార్‌తో పాటు అతడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

బాబా మాలధారణ



బలభద్రపురంలో బాబా మాల ధరించిన భక్తులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఆంధ్రా షిర్డీ సాయి ఆలయం వద్ద పలువురు భక్తులు బాబా మాలధారణ చేశారు. 54 మంది మాలధారణ చేసినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తం రెడ్డి తెలిపారు. మాలధారులకు దేవస్థానం ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తుందని చెప్పారు.

బీసీలకు రాజ్యాధికారం కావాలి



వెంకటాపురం సమావేశంలో పాల్గొన్న బీసీ నాయకులు

రంగంపేట: బీసీలకు రాజ్యాధికారం కావాలని బీసీ నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, గురజారపు వీరభద్రరావు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వెంకటాపురం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 136 కులాలతో 60 శాతం ఉన్న బీసీలందరూ కలిసికట్టుగా ఉంటే రాజ్యాధికారం సాధించగలమన్నారు. అందుకే గ్రామాల్లో వివిధ కులాల్లో ఉన్న బీసీలను ఏకతాటిపైకి తేవడానికి ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీలన్నీ బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని, ఇకనైనా మేలు కోవాలని కోరారు. కార్యక్రమంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు కేతా సత్తి బాబు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవాలు



బిక్కవోలు: మండలంలోని మెళ్లూరు ప్రసన్న ఆంజనేయ స్వామి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం నాలుగో రోజు శ్రీరామ సప్తాహం సందర్భంగా స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామి సంకీర్తనలు వింటూ ప్రత్యేక పూజలు చేశారు.

ఎంపీ భరత్‌ను కలిసిన ఆచంట అనసూయ



ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరించి వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని అందజేస్తున్న ఆచంట అనసూయ

రాజమహేంద్రవరం రూరల్: భగవంతునికి సేవ చేసుకునే అదృష్టం రావడానికి పూర్వజన్మ సుకృతం ఉండాలని, అటువంటి భాగ్యం వచ్చిన మీరు అదృష్టవంతులని ద్వారకా తిరుమల ట్రస్టు బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన ఆచంట అనసూయను ఉద్దేశించి ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ పాలకమండలి సభ్యులుగా నియమితులైన గోపాలపురం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు ఆచంట అనసూయ శనివారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి వచ్చి ఎంపీ భరత్ రామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తనను ఈ పదవిలో నియమించడంపై ఎంపీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి, అలాగే భక్తుల సౌకర్యాలకు, వారి సమస్యలు పరిష్కారానికి తగిన కృషి చేయాలని అనసూయకు సూచించారు.

స్నాన ఘట్టాలు శుభ్రం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ : ఈ నెల 18వ తేదీన జరిగే మహాశివరాత్రి పర్వదినం నిమిత్తం వివిధ ప్రాంతాల నుంచి రాజమహేంద్రవరానికి వచ్చే యాత్రికులకు స్నాన ఘట్టాలలో సౌకర్యాలు కల్పించాలని, ఆడవారికి దుస్తులు మార్చుకోవడానికి గదులను ఏర్పాటు చేయాలని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధికారులను కోరారు. శనివారం స్థానిక పేపర్ మిల్లు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ సాయి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుణ్య స్నానాలు ఆచరించే భక్తులకు గోదావరి రేవులలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని ఆయన ఆక్షేపించారు. ఈ విషయమై కార్పొరేషన్‌ను కోరగా వారు మూడు రోజుల సమయం అడిగారని, అందువల్ల ఆ సమయం లోపు పారిశుధ్యాన్ని మెరుగు పరచకుంటే, తామే స్వచ్ఛందంగా తమ సమితి ఆధ్వర్యంలో నడుం బిగించి, వివిధ కళాశాలల విద్యార్థులతో కలిసి స్నాన ఘట్టాలను పరిశుభ్రం చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు పినిశెట్టి సుబ్బరాజు, ఎస్.వి.వి.రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

బైకు ఢీకొని వ్యక్తికి గాయాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో బైక్ ఢీకొనడంతో ఒక వ్యక్తికి గాయాలైన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం రామచంద్రపురం మండలం ఓదూరు గ్రామానికి చెందిన గంటాల సింహాచలం కేపీఆర్ ఫెర్టిలైజర్‌లో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 8వ తేదీన డ్యూటీకి వెళుతుండగా బిక్కవోలు కాటన్ దొర విగ్రహం వద్ద ఎదురుగా వస్తున్న బైక్ వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. గాయాలపాలైన సింహాచలంను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ చెప్పారు.

సమస్యలు విన్నవించిన ఆటో యూనియన్ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు కోటిపల్లి బస్టాండు మదర్ థెరీసా ఆటో యూనియన్ నాయకులు అభ్యర్థించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎన్వీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయానికి వెళ్లి ఎంపీ భరత్‌ను కలిశారు. తమ సమస్యలను తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రతినిధులకు ఎంపీ భరత్, యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎన్వీ శ్రీనివాసరావు పూలమాలలు వేసి అభినందించారు.

13న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా

రాజమహేంద్రవరం రూరల్: కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ కంపెనీలలో వివిధ ట్రేడ్‌ల్లో అప్రెంటీస్ ఖాళీలను భర్తీ చేసేందుకు ధవళేశ్వరం ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ జి.వి.రమణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా ద్వారా ప్రముఖ కంపెనీలు సుమారు 200 ఖాళీలు భర్తీ చేయనున్నారు. తాళ్లపూడి టాగూర్ ల్యాబోరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పెయింటర్, బాయిలర్ ఆపరేటర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ ట్రేడ్‌ల్లోలో సుమారు 150 ఖాళీలను భర్తీచేయనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.8 వేల స్టైఫండ్, భోజన, రవాణా సౌకర్యం కల్పించనున్నారు. శిక్షణ కాలం పూర్తయిన తరువాత కంపెనీలో ఉద్యోగావకాశం ఉంటుందని తెలిపారు. ఉద్యోగకాలంలో జీతంతో పాటు, రవాణా సౌకర్యం, క్యాంటీన్ వసతి, బోనస్, ఇన్సెంటివ్ కూడా ఇస్తారన్నారు. ఇతర ప్రముఖ కంపెనీలలో కూడా అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్ కల్పిస్తారని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో వివిధ ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ అప్రెంటీస్ ప్రొఫైల్‌తో పాటు ఒక జత జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. మేళాకు హాజరయ్యే వారు ముందుగా అప్రెంటీస్ ఐబీఎం పోర్టల్ httpr://dft.gov.in/appmea2022లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 96765 60002, 9848738841 నంబర్లకు సంప్రదించాలని జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ జి.వి.రమణరావు కోరారు.